క్లుప్తంగా

వైభవంగా శ్రీరామ కథాజ్ఞాన యాగ మహోత్సవం



మహా పూర్ణాహుతిలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన

చంద్రగిరి: శ్రీవారి మెట్టు శ్రీభక్తాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద గురువారం మరాఠీలు శ్రీరామ్ కథా జ్ఞాన యాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని దర్శించుకుని, అక్కడ జరుగుతున్న మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డికి నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా తలపాగా ధరింపజేసి, ఆహ్వానం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మాజీ సర్పంచ్ భాస్కర్‌నాయుడికి నివాళి



భాస్కర్‌నాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని రావిళ్లవారిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఏనుగు భాస్కర్ నాయుడు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే డా. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని భాస్కర్ నాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ రాజేష్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు భాస్కర్ యాదవ్, మహేంద్రరెడ్డి, వెంకటేష్, జ్యోతి, నీలకంఠ చౌదరి, ముక్కోటి, ప్రతాప్ ఉన్నారు.

శ్రీరాముడి అక్షింతల వితరణ



భక్తులకు అక్షింతలు పంపిణీ చేస్తున్న భజన మందిరం చైర్మన్, పూజారి

తిరుపతి కల్చరల్: అయోధ్యలో భవ్యమైన రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా శివజ్యోతి నగర్‌లోని శ్రీరామ భజన మందిరం వద్ద బుధవారం భక్తులకు శ్రీరామ పూజిత అక్షింతలు వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ భజన మందిరం చైర్మన్ కొత్తపల్లి మునిరత్నం, ఆలయ పూజారి, భక్తులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత



పర్సుతో పాటు నగదును భక్తురాలికి అప్పగిస్తున్న ఆలయ అధికారులు

చంద్రగిరి: స్వామివారి దర్శనానికి వచ్చి పర్సు పోగొట్టుకున్న మహిళలకు టీటీడీ అధికారులు తిరిగి అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పాండిచ్చేరికి చెందిన పాచ్చానమ్మ అనే మహిళ గురువారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చింది. స్వామివారి దర్శనానంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో తన పర్సును పోగొట్టుకుంది. దీంతో ఆలయ అధికారులు సమాచారం ఇవ్వడంతో అధికారులు సీసీ పుటేజీ ద్వారా పర్సును గుర్తించారు. అనంతరం పర్సుతో పాటు రూ.6 వేల నగదును అధికారులు భక్తురాలికి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చెంగ్రాయులు, జమేదారు చిరంజీవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, తిమ్మభూపాలపురం గ్రామాల సమీపంలో బుధవారం కోడి పందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి నాలుగు కోళ్లు, రూ.3400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు పేర్కొన్నారు. మండలంలో కోడి పందేలు ఆడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానిస్టేబుళ్లు ప్రభాకర్, అరుణ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా ప్రకటించాలి

- ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి
- అధికారులతో ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ సమీక్ష



మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ పోలా భాస్కర్

తిరుపతి అర్బన్: ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22వ తేదీన కచ్చితంగా ప్రకటించాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ–2024 ఓటర్ల తుది జాబితా ఉంటుందని చెప్పారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈ నెల 23వ తేదీన తుది జాబితా అందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు నియమాలను పాటిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. మరోవైపు రాజకీయ పార్టీల నేతలు ఇచ్చే ఫిర్యాదులకు తప్పకుండా పరిష్కారం చూపాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ముసాయిదా జాబితా 2023 అక్టోబర్ 27న ప్రకటించడం జరిగిందన్నారు. అన్ని రకాల ఫారమ్స్ 4,15,235 అందాయని, వాటిలో 0.17 శాతం మినహా మిగిలిన వాటిని పరిశీలించి పూర్తి చేశామని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు జరిపి ఎస్ఎస్ఆర్ -2024పై సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు వివరించారు. ఈనెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురించడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాల్లో అందిన ఫిర్యాదులు 100శాతం పరిష్కరించాలని చెప్పారు. తుది జాబితా ప్రచురణ కోసం ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ బీటా వర్షన్ అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని చెప్పారు. ఏఇఆర్ఓలు, ఈఆర్ఓలు పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలించి నియోజకవర్గాల వారీగా జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించి, వారి నుంచి తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. కొత్త ఓటర్ కార్డుల ప్రింటింగ్, పంపిణీపై ఎన్నికల కమిషన్ అనుమతితో త్వరగా ఓటర్లకు అందించాలని చెప్పారు. ప్రతి కొత్త నమోదు, తొలగింపు, మార్పు ఓటర్లకు సంబంధించి ఫైల్స్ సిద్ధంగా ఉండాలని ఎన్నికల కమిషన్ పరిశీలనలో వీటిని నిశితంగా పరిశీలిస్తారన్నారు. ఈ సమీక్షలో తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, శ్రీకాళహస్తి ఆర్డీఓ శివశంకర్ రెడ్డి, పలువురు ఏఈఆర్ఓలు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా ప్రక్రియ



ఓటరు జాబితాపై కసరత్తు చేస్తున్న ఓటరు నమోదు అధికారి హరిత

తిరుపతి తుడా: తిరుపతి నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా ప్రక్రియను చేపట్టామని ఓటరు నమోదు అధికారి హరిత తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కమిషనర్ హరిత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పులు లేని పక్కా ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల సిబ్బంది నిరంతరం శ్రమించారని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జాబితా జనవరి 22న ప్రకటిస్తారన్నారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులు, అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని చెప్పారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలపై ఆమె కూలంకుషంగా వివరించారు. తిరుపతి ఓటర్ నమోదు అదనపు అధికారులు తిరుపతి అర్బన్ తహసీల్దారు వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటం ఆవిష్కరణ



అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: దేశ రాజకీయాల్లో ఎవరికీ లేనివిధంగా ఆంధ్రరాష్ట్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలాలు కలిగిన గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. రాజకీయ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కానీ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల స్మృతివనం ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ ప్రవీణ్, పార్టీ నాయకులు నాగేంద్ర, రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి



రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న ఆపస్ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో సెలవు దినంగా ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని దేవదాయ శాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ ఏ.సత్యనారాయణను కలిసి విజ్ఞప్తి చేసినట్లు అందులో పేర్కొన్నారు. అలాగే హిందువులకు మూడు పండుగలకే ఐచ్ఛిక సెలవులను జాబితాలో చేర్చారని, అయితే పంచమి, నరక చతుర్దశి, శ్రావణ పౌర్ణమి వంటి హిందూ పండుగలను ఐచ్ఛిక సెలవుల జాబితాలో చేర్చాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆపస్ రాష్ట్ర నాయకులు సీహెచ్ శ్రావణ్‌కుమార్, రఘునాథ్, మార్కండేయులు ఉన్నారు.

కపిలతీర్థంలో కారిడార్ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న కపిలతీర్థం పురోహిత సేవాసంఘం గౌరవ సలహాదారుడు రాజేష్

- శ్రీకపిలేశ్వర పురోహిత సేవా సంఘం నేతల విజ్ఞప్తి

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలో శాశ్వత పురోహితం నిర్వహణ కోసం కారిడార్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని శ్రీకపిలతీర్థం పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్, అధ్యక్షుడు ఎ.అనిల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15వ తేదీన కపిలతీర్థంలో పితృదర్పణ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ ప్రత్యేక షెడ్లు వేయడంతో పాటు ఏర్పాట్లు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఫారెస్ట్ అధికారులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కపిలతీర్థం వేదికగా పురోహితమే జీవనంగా సంఘ సభ్యులు సుమారు 200 మంది బతుకుతున్నట్లు చెప్పారు. తమకు పురోహితం నిర్వహణ కోసం కపిలతీర్థం వద్ద స్థలం కేటాయించి కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల జరిగిన పితృదర్పణ కార్యక్రమాల సందర్భంగా బయట వ్యక్తులు కొందరు ప్రజలకు పితృదర్పణ గడియలపై తప్పుడు ప్రచారం చేసి తమకంటే ముందుగా కపిలతీర్థం చేరుకుని స్థలాలు ఆక్రమించి పురోహితం చేపట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వాపోయారు. కపిలతీర్థంలో పురోహిత వృత్తి చేసుకునే తమ సంఘం వారికి టీటీడీ గుర్తింపు కార్డులు ఇచ్చి వివాదాలకు చోటు లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదాన సత్రం పరిశీలన



భక్తులతో మాట్లాడుతున్న ఈవో

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రాన్ని బుధవారం ఈవో కేఎస్ రామారావు పరిశీలించారు. కూరగాయలు, బియ్యం, సరుకుల గురించి సిబ్బందిని ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సత్యవేడు: విజేతగా నిలిచిన పెద్ద ఈటిపాకం సచివాలయం జట్టు

బుచ్చినాయుడుకండ్రిగ : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు 190 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమ్‌రావు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో పెద్ద ఈటిపాకం జట్టు సత్తా


సత్యవేడు: ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పెద్ద ఈటిపాకం సచివాలయం యువకులు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచారు. పెద్ద ఈటిపాకం–సత్యవేడు–4 జట్ల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పెద్ద ఈటిపాకం జట్టు క్రీడాకారులు 94 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సత్యవేడు–4 జట్టు క్రీడాకారులు 64 పరుగులకే ఆల్ అవుట్ అయ్యారు. విజేత జట్టుకు సత్యవేడు–4 ఎంపీటీసీ షీలా, ఆమె భర్త రాబిన్ వ్యక్తిగతంగా రూ.516 బహుమతి అందజేశారు. ఈవోపీఆర్డీ మునిరవికుమార్, పీడీలు ఏకే. మురళి, కే.సతీష్, కే.మణి, పయణీబాబు, గ్రేస్ ప్రతిమ, స్వర్ణ, అపర్ణ, ఢిల్లీరాణి పాల్గొన్నారు.


ఆడుదాం– ఆంధ్రా కబడ్డీ విజేత ఇరుగుళం


ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో ఇరుగుళం సచివాలయం జట్టు విజయం సాధించింది. ఇరుగుళం జట్టు 12 పాయింట్లు, శిరుణంబూదూరు జట్టు 11 పాయింట్లు సాధించాయి. ఒక పాయిట్ తేడాతో ఇరుగుళం జట్టు విజేతగా నిలిచింది. కెప్టెన్ సాయి కుమార్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఏకే.మురళి, ఢిల్లీరాణి, కే.సతీష్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేత మన్నముద్రం, బండారుపల్లి జట్టు

ఏర్పేడు : మండలంలోని కుప్పయ్యకండ్రిగలో బుధవారం జరిగిన ఆడుదాం–ఆంధ్రాలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో మన్నసముద్రం, బండారుపల్లి జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో ఇప్పటి వరకు పలు గ్రామాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయి. బుధవారం బండారుపల్లి సచివాలయ పరిధిలోని బండారుపల్లి, మన్నసముద్రం గ్రామాలకు చెందిన జట్టు చెల్లూరు జట్టుపై 15 పరుగుల తేడాతో విజయం సాధించింది.







బుచ్చినాయుడుకండ్రిగ: బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎంపీడీవో, సత్యవేడు: కబడ్డీ విజేత ఇరుగుళం జట్టు, ఏర్పేడు: ఆనందం వ్యక్తం చేస్తున్న విజేతలు

ఘనంగా గోవిందుడి పార్వేట ఉత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి, అమ్మవారికి ఆస్థానం నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు



పార్వేట ఉత్సవంలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించడానికి పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తిరిగి నగర వీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6.30 గంటలకు ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, జేఈఓ వీరబ్రహ్మం, సీఏఓ బాలాజీ, బాలిరెడ్డి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్, తుడా చైర్మన్‌తో ఎస్వీయూ వీసీ భేటీ





ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి రూరల్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ శ్రీకాంత్ రెడ్డి బుధవారం ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రభుత్వ విప్, తుడా చైర్మన్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం వీసీ శ్రీకాంత్ రెడ్డికి వారు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం వచ్చే ఎంతో మందికి మంచి విద్యను అందించడంతో పాటు విశ్వవిద్యాలయ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

ఘనంగా పశువుల పండుగ

పాకాల: మండలంలోని గానుగపెంటలో పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కనుమ పండుగను పురస్కరించుకుని పరుష పందేలు జరిగాయి. పండుగ సందర్భంగా ఎద్దుల కొమ్ములకు రంగులు అద్ది, రకరకాల పలకలు కట్టి సుందరంగా అలంకరించి గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించారు. స్థానిక గ్రామ దేవతలకు పొంగళ్లు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఊపు మీద ఉన్న ఎద్దులను బరిలోకి పరుగుల పెట్టించారు. గ్రామంలోని యువత రెట్టించిన ఉత్సాహంతో రంకలేస్తున్న ఎద్దులను నిలువరించేందుకు పరుగులు తీశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన ఈ పందేలను చూసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తుడా మాజీ చైర్మన్ కన్నుమూత



ఎల్‌బి ప్రభాకర్ నాయుడు (ఫైల్)

పాకాల: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తుడా మాజీ చైర్మన్ ఎల్‌బి ప్రభాకర్ నాయుడు (75) బుధవారం రాత్రి కన్నుమూశారు. మండల కేంద్రంలోని కమతంపల్లెకు చెందిన ఈయన వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ప్రభాకర్ నాయుడు మండలంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా పనిచేశారు. ఆయనకు భార్య కౌసల్య, కుమార్తె ఉన్నారు. ఆయన భార్య గతంలో పాకాల పంచాయతీ సర్పంచ్‌గా సేవలందించారు. కుమార్తెను మదనపల్లెకు చెందిన వైద్యుడికిచ్చి వివాహం చేశారు.

19న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలిరండి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నల్లానిబాబు పిలుపు



నల్లాని బాబు

తిరుపతి మంగళం: విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల స్మృతివనం ప్రారంభోత్సవానికి తిరుపతి జిల్లా నుంచి ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ పాలనలో అంటరానివాళ్లుగా చూస్తున్న దళితులకు సమాజంలో సముచిత స్థానం కల్పిస్తూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లలో దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నతస్థాయికి ఎదిగారంటే అది కేవలం జగనన్న పాలనలో మాత్రమేనన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో దళితులకు ఇన్ని ఉన్నత పదవులు కల్పించిన దాఖలాలే లేవన్నారు. 19న ప్రారంభించనున్న 206 అడుగుల అంబేడ్కర్ స్మృతివనం దళితుల అభ్యున్నతికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. దళితులు సీఎం జగనన్నకు జీవితకాలం రుణపడి ఉంటామని చెప్పారు.

స్విమ్స్‌కు వీల్ చైర్ల వితరణ



వీల్ చైర్లను స్వీకరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రికి రూ.50 వేలు విలువచేసే వీల్ చైర్లను వితరణగా అందజేశారు. ఈ మేరకు దాతలు బుధవారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌కు 10 వీల్ చైర్లను అందించారు. స్విమ్స్‌లో 30 ఏళ్ల పాటు ఏఎన్ఎంగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన ఎం.సుధారాణి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వాటిని అందించారు. దాతలు పార్థు, తనూజతో పాటు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

కొండచుట్టు ఉత్సవానికి తరలిన దేవతలు





సర్వభూపాల వాహనంలో పరాశరేశ్వరస్వామి, పాలీశ్వరస్వామి

నారాయణవనం: సంక్రాంతి పండుగ సందర్భంగా నగరిలో బుధవారం కొండచుట్టు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో నారాయణవనం మండలంలోని శివక్షేత్రాల నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి, మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం వేకువజామునే నిత్యపూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులు సముదాయంలోని అరుణానదిలో సందిపు ఉత్సవంలో పాల్గొని నగరికి బయలుదేరారు. సముదాయం గ్రామానికి చెందిన రైతులు తమ ఆవులను అలంకరించి ఉత్సవర్లకు ఎదురుగా పరుగెత్తించారు. ఊరేగింపు నారాయణవనం కోట వీధులు, కీళగరం, గోవిందప్పనాయుడుకండ్రిగ మీదుగా తుంబూరు చేరుకుంది. అప్పటికే పాలమంగళం పాలీశ్వరస్వామి, తుంబూరులోని తుంబీశ్వరస్వామి సందింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు ఆలయాల ఉత్సవర్లు పాలమంగళం, ఎలకాటూరు, ఆరూరు, బుగ్గఅగ్రహారాల మీదుగా సాయంత్రానికి నగరిలో జరిగే కొండచుట్టు ఉత్సవంలో కొలువుదీరారు. అనంతరం ఉత్సవమూర్తులు నగరి నుంచి అర్ధరాత్రి దాటాక ఆలయాలకు చేరుకున్నారు.